కలెక్టరేట్ వద్ద దీక్షా శిబిరంలో మిర్చిలు, బజ్జీలు తయారు చేస్తూ వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సమగ్ర శిక్షా ఉద్యోగుల వినూత్న నిరసన

రిలేదీక్ష శిబిరంలో మిర్చిలు, బజ్జీలు తయారుచేసి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు అందజేత

జనగామ, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : తమ సమస్యల పరిష్కారం కోసం గత 16 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట వినూత్న నిరసన తెలిపారు. మిర్చి, బజ్జీలు తయారు చేసి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు అందించి వినూత్న రీతిలో రాష్ట్ర ప్రభుత్వంపై నిరసన తెలిపారు. వర్షంలో సైతం సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ నిరసనను కొనసాగించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరు రమేశ్ మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలన్నారు. న్యాయమైన కోర్కెలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తమ సమస్యలపై సానుకూలంగా వ్యవహరించకుండా సర్కారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే నిరసన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలనే ప్రధాన డిమాండ్‌ను నెరవేర్చే వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్షా ఉద్యోగులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరిం చాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు బైరగోని దయాకర్ గౌడ్, గోలి రవీందర్‌రెడ్డి, రొయ్యల రాజు, శ్రీనివాస్, నరేశ్, కరుణాకర్, అబ్బ, హరిత, శోభారాణి, రమ, రజిత, మంజుల, పూర్ణ, కవిత తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి : ఎమ్మెల్యే

కొడకండ్ల, డిసెంబర్ 25 : పాలకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. మండలంలోని నర్సింగాపురం వద్దగల బయ్యన్నవాగుపై రూ.2 కోట్లతో చేపట్టే చెక్‌డ్యాము నిర్మాణ పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా యశస్వినీరెడ్డి మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులతోపాటు వాగులపై పెద్ద ఎత్తున చెక్‌డ్యాముల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నదని ఆమె వివరించారు. అనంతరం మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్‌ను ఆమె ప్రారంభించారు. కొడకండ్ల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని యశస్వినీరెడ్డి తెలిపారు.

క్యాంపు కార్యాలయంలో సత్యనారాయణస్వామి వ్రతం

పాలకుర్తి, డిసెంబర్ 25 : మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి దంపతులు బుధవారం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమండ్ల ఝాన్సీరెడ్డి, రాజేందర్‌రెడ్డి, పాలకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్యా మంజుల, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, గడ్డం యాక సోమయ్య, గాదెపాక భాస్కర్, కొప్పుల సుధాకర్, మోజాస్, కమ్మగాని నాగయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, TALALA UMAMAHESWARI SREEVALLI W/o. TALALA VENKATESH R/o H.No: 31-3-783, Flat No. 304, Sri Datta Mansion, Parimala Colony, Road No. 10 Hanamkonda. 506370, T.G. Change my name from NANDIGAMA UMAMAHESWARI SREEVALLI to TALALA UMAMAHESWARI SREEVALLI for all purposes.

PLOTS FOR SALE

★80% బ్యాంకు లోన్‌తో వరంగల్ హైవే ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ DTCP అప్రూవ్డ్ ప్లాట్స్, కంప్లీట్ CC రోడ్స్, ఎల్రక్టిసిటీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ట్యాంక్‌తో. సంప్ర: 8109994456.

NT-326623

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

రేపటి నుంచి రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 25 : రాష్ట్రస్థాయి సీఎం కప్‌లో భాగంగా ఈ నెల 27 నుంచి 2 వరకు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో హ్యాండ్ బాల్, సెపక్‌తక్రా, కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నట్లు హనుమకొండ జిల్లా క్రీడల యువజన శాఖ అధికారి గుగులోత్ అశోక్‌కుమార్ నాయక్ తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వెయ్యి మంది క్రీడాకారులు, 200 మంది అధికారులు హాజరుకానున్నారని, కిట్స్ కాలేజీతో పాటు జేఎన్ఎస్, స్థానిక వసతి గృహాలు, యూత్ హాస్టల్లో వీరికి వసతి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఈ పోటీలో పాల్గొనేందుకు అన్ని జిల్లాల క్రీడాకారులు బుధవారం మధ్యాహ్నం నుంచి నగరానికి రానున్నట్లు చెప్పారు. పోటీల విజయవంతానికి కలెక్టర్ ప్రావీణ్య ఆధ్వర్యంలో జిల్లా అధికారులతో వివిధ కమిటీలను ఏర్పాటు చేసి యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కరీంనగర్‌లో జరిగే జూడో, మహబూబ్‌నగర్‌లో జరిగే కబడ్డీ, ఖమ్మంలో జరిగే వాలీబాల్, హైదరాబాద్‌లో జరిగే హాకీ, కిక్ బాక్సింగ్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, టెన్నిస్, బిలియర్డ్స్ అండ్ స్నూకర్, వుషు, రోయింగ్, సైక్లింగ్, షూటింగ్, ఫుట్‌బాల్ (మహిళలు) రంగారెడ్డి జిల్లాలో జరిగే బాస్కెట్‌బాల్ పోటీలో పాల్గొనే వారు ఈ నెల 26న రిపోర్ట్ చేయాలని కోరారు.

లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు

కమలాపూర్, డిసెంబర్ 25 : మండలంలోని గుండేడు గ్రామానికి చెందిన మహిళపై అదే గ్రామానికి చెందిన మేకల కనకయ్య (55) లైంగిక దాడికి యత్నించినట్లు ఎస్సై వీరభద్రరావు బుధవారం తెలిపారు. మహిళ రాత్రి ఇంటి వద్ద ఒంటరిగా ఉండగా కనకయ్య ఆమె ను బలవంతంగా స్కూల్లోకి తీసుకెళ్తుండగా కేకలు వేసింది. దీంతో గ్రామస్తులు రావడంతో పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

జనగామలోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

జనగామలో అన్నదానం చేస్తున్న క్రైస్తవులు

గోవర్ధనగిరిలోని చర్చిలో క్రైస్తవుల ప్రార్థనలు

స్టేషన్‌ఘన్‌పూర్ చర్చిలో కేకు కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

అంబరాన్నంటిన క్రిస్మస్ సంబురాలు

- జిల్లాలోని చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు, కేకుల పంపిణీ
- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

జనగామ, (నమస్తే తెలంగాణ)/నర్మెట/రఘునాథ పల్లి/ జనగామ రూరల్/బచ్చన్నపేట/తరిగొప్పుల/ దేవరుప్పుల/ పాలకుర్తి, డిసెంబర్ 25 : పరిశుద్ధాత్ముడు.. దీనజన బాంధవుడు.. కరుణామయుడైన యేసుక్రీస్తు జన్మదిన వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లా కేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమాలు హోరెత్తగా..చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా వ్యాప్తంగా చర్చిల్లో బుధవారం యేసుప్రభువు చరిత్రను ఫాదర్లు వివరించారు. క్రైస్తవులు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ ఉల్లాసంగా గడిపారు. కేక్‌లు కట్‌చేసి పంచారు. నూతన వస్త్రాలు ధరించి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రభువు సందేశం వినిపించారు. పలుచోట్ల స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పేద క్రైస్తవులకు దుస్తుల పంపిణీ, అన్నదానం చేశారు. పట్టణాల్లో చర్చిలన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. జిల్లా కేంద్రంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, హైదరాబాద్ రోడ్డులోని యూనిక్ చర్చి, ధర్మకంచ బేతేలు చర్చి, గిర్నిగడ్డ కార్మియల్ చర్చితోపాటు హనుమకొండ రోడ్డులోని సెయింట్ పీటర్స్ అండ్ పాల్స్ క్యాథలిక్ చర్చిలో ప్రార్థనలు జరిగాయి. జనగామలోని ఉన్నపుర బాప్టిస్టు చర్చిలో జరిగిన వేడుకల్లో పెద్దఎత్తున క్రైస్తవులు పాల్గొని ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ తాత వేషధారణంలో పలువురు ఆకట్టుకున్నారు. సెయింట్స్ పీటర్ అండ్ పాల్ చర్చిలో విచారణ ఫాదర్ ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో అర్ధరాత్రి కేక్‌కట్ చేసి క్రిస్మస్ వేడుకలు జరుపుతున్నారు. కార్యక్రమంలో బ్రదర్ రాజశేఖర్, సిస్టర్స్ ఇన్నమ్మ, మర్రెడ్డి, గోపు శోభన్‌రెడ్డి, సెలస్టిన్‌రెడ్డి, కౌన్సిలర్ మెంబర్ పెద్దోజు జగదీశ్ తదితరులు పాల్గొన్నారు. జనగామలోని రాజేశ్వరీ వృద్ధ ఆనాథశ్రమంలో క్రిస్మస్ సంబురాలు జరిగియి. ధర్మకంచ బెతెల్ బాప్టిస్ట్ చర్చిలో సంఘ కాపరి నల్లా జాన్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఫాస్టరమ్మ రోస్ అరుణాజాన్, సంఘ పెద్దలు మిద్దెపాక స్టాలిన్, నీర్మాల రాములు, పానుగంటి ప్రేమ్‌కుమార్, గాదెపాక రాంచందర్, తబిత, సువార్త, లావణ్య, కాలేబ్ అశోక్, సుద్దాల కుమార స్వామి, తాల్క లక్ష్మణ్, పుష్ప, హరీశ్, సుమన, సుధాకర్, రాజు పాల్గొన్నారు. నర్మెట మండల కేంద్రం తోపాటు గుంటూరుపల్లి, ఆగాపేట, హాన్మం తాపూర్, మచ్చుపహాడ్, వెల్దండ, బొమ్మకూర్, కన్నెబో యిన గూ డెం, అమ్మాపురం, గండిరామవరం గ్రామాల్లో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో కేక్‌లు కట్ చేసి ప్రార్థనలు నిర్వహించారు. నర్మెట చర్చిలో పేద క్రైస్తవులకు చీరలను పంపిణీ చేశారు. రఘునాథపల్లి మండల కేంద్రంలోని లూర్థామాత చర్చితోపాటు కంచనపల్లి, గోవర్ధనగిరి, కోమల్ల, కోడూర్ గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేకులు కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు నరేందర్, వెంకటస్వామి, ఆదాం తదితరులు పాల్గొన్నారు. జనగామ మండలం శామీర్ పేటలోని చర్చిలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. బచ్చన్నపేట మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. తరిగొప్పుల మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. రెవరెండ్ సామ్యూల్ కరుణాకర్ సం ఘం కాపరులు కరుణాకర్, దేవదానం, కార్యదర్శి సత్యానందం కోశాధికారి నవీన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవరుప్పుల మండలం కడవెండి చర్చిలో పాస్టర్లు ప్రసన్న పాల్, సునప్‌జీ కేక్ కట్ చేసి ప్రార్థనలు నిర్వహించారు. యేసు బోధనలు, శాంతిమార్గంపై క్రైస్తవులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, రాము లు, పవన్‌కుమార్, సుధాకర్, శ్రీనివాస్, సోమయ్య పాల్గొన్నారు. పాలకుర్తిలోని చర్చిలో ఎమ్మెల్యే మామి డాల యశస్వినీరెడ్డి క్రిస్మస్ కేకును కట్ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రేమ, కరుణ, శాంతి సామరస్యానికి యేసు చూపిన మార్గం అనుసరిణీయమని అన్నారు. అందరి సహకారంతో పాలకుర్తి నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. మరోవైపు కార్మెల్ కాన్వెంట్ చర్చిలో సిస్టర్ లిజ్‌బెత్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

పాలకుర్తిలోని చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి

శామీపేర్‌పేటలో కేకు కట్ చేస్తున్న జనగామ మార్కెట్ చైర్మన్ శివరాజుయాదవ్

యేసు బోధనలు ఆదర్శనీయం : రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 25 : యేసు బోధనలు అందరికీ ఆదర్శనీయమని, శాంతి, సామరస్యంతో అందరూ కలిసిమెలిసి ఉండాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని చర్చిలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యఫాతిమా మేరి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి కేకు కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రైస్తవులతో కలిసి ప్రార్థనలు చేశారు. రాజయ్య మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో క్రైస్తవుల కోసం నాటి సీఎం కేసీఆర్ పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని గెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జయప్రతాప్, ప్రకాశ్, అగస్టిన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తాటికొండ సురేశ్ కుమార్. మాజీ ఎంపీటీసీ సింగపురం దయాకర్, సింగపురం రాజయ్య, సింగపురం వెంకటయ్య, చింత ఎల్లయ్య, తాటికొండ మధు, సింగపురం రవి పాల్గొన్నారు.

27న స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీపీఎం నేతృత్వంలో బహిరంగసభ

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 25 : సీపీఎం జిల్లా మహాసభల నేపథ్యంలో ఈ నెల 27న స్టేషన్ ఘనపూర్‌లో జరిగే భారీ బహిరంగ సభకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు పిలుపునిచ్చారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం పోరాటం చేస్తున్నదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు, అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని ఉద్యమిస్తున్నట్లు రాజు తెలిపారు. ఈనెల 27, 28 తేదీల్లో జరిగే మహాసభల్లో జిల్లాలోని సమస్యలపై చర్చించి పోరాటం రూపొందిస్తామని ఆయన వివరించారు. 27వ తేదీన స్టేషన్‌ఘన్‌పూర్‌లోని గ్రామపంచాయతీ క్రీడా ప్రాంగణంలో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. దీనికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవుతారని తెలిపారు. మండల కార్యదర్శి మునిగెల రమేశ్, జిల్లా కమిటీ సభ్యులు కోడెపాక యాకయ్య, చిలుముల భాస్కర్, శివునిపల్లి కార్య దర్శి భూశెట్టి రాంబాబు పాల్గొన్నారు.

రఘునాథపల్లి, శామీర్‌పేటలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి వేడుకలు

రఘునాథపల్లి/జనగామరూరల్/ డిసెంబర్ 25: దివంగత మాజీ ప్రధాని అటల్ బీహరి వాజ్‌పేయి జయంతి వేడుకలను మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని బడుగు బలహీనం వర్గాల అభ్యున్నతికి వాజ్‌పేయి అందించిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, కావటి ముత్యాలు, జిల్లా కార్యదర్శి మంద వెంకటేశ్, కల్పగురి ప్రభాకర్, మార్కాల వెంకట్‌రెడ్డి, రంజిత్, పొన్నాల అంజనేయులు, బోళ్ల అఖిల్, సంపత్, కమలాకర్ పాల్గొన్నారు. జనగామ మండలం శామీర్‌పేటలోని కాళోజీ చౌరస్తాలో వాజ్‌పేయి చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లద్దూనూరి మహేశ్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శోభనబోయిన శివరాజ్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు మార్ర ఉపేందర్ గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు జంగరాజ వెంకటనర్సింహారెడ్డి, నాయకులు సంతోష్, రవికుమార్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో నిహారిక

జనగామ, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరుగుతున్న జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీల ప్రారంభ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పోటీలకు జనగామ పట్టణానికి చెందిన తాటి నిహారిక తెలంగాణ జట్టు నుంచి హాజరైంది. జిల్లా కేంద్రంలోని సాన్ మారియా హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న నిహారిక ఇటీవల కరీంనగర్‌లో జరిగిన నెట్‌బాల్ టోర్నమెంట్ ఎంపిక పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి జాతీయస్థాయి టోర్నమెంట్‌కు ఎంపికైంది. ఈనెల 22 నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్ (అండర్-14) విభాగంలో రాష్ట్ర బృందం నుంచి తాటి నిహారిక పాల్గొంటున్నది.

నెట్ బాల్ పోటీల ప్రారంభ వేడుకల్లో తాటి నిహారిక

విద్యుదాఘాతంతో రైతు మృతి

జనగామ రూరల్, డిసెంబర్ 25 : విద్యుత్‌షాక్‌తో యువ రైతు మృతి చెందిన ఘటన మండలంలోని పెద్దరాంచర్లలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దరాంచర్లకు చెందిన జిల్లెల రాజ్‌కుమార్(32) తన వ్యవసాయ బావివద్ద పొలం పనులు చేస్తున్నాడు. బోరు మోటర్ నీరు సరిగా పోయకపోవడంతో పరిశీలించగా ట్రాన్స్‌ఫారమ్ వద్ద ఫీజ్ కొట్టేసింది. దీనిపై విద్యుత్ అధికారులకు రాజ్‌కుమార్ సమాచారం అందించాడు. అనంతరం ఫీజు కొట్టేసిన ప్రదేశానికి వెళ్లి పరిశీలిస్తుండగా షాక్ వచ్చి రాజ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని జనగామలోని దవాఖానకు తరలించగాచికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను మాజీ సర్పంచ్ కుమారుడు ఎళ్ల సంతోష్‌రెడ్డి పరామర్శించారు. ఇదిలా ఉండగా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే రాజ్‌కుమార్ మృతి చెందాడని స్థానికులు ఆరోపించారు. మృతుడి తండ్రి రాంరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

'ఇందిరమ్మ' లబ్ధిదారులను గ్రామసభల్లో ఎంపిక చేయాలి

పాలకుర్తి, డిసెంబర్ 25: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపునకు గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు, బుధవారం మండల కేంద్రంలోని చిట్యాల ఐలమ్మ స్మారక భవన్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు, కనకారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నియోజక వర్గానికి 3500 ఇళ్లు మాత్రమే మంజూరు చేసిన్నారు. దీంతో గ్రామానికి 30 నుంచి 40 ఇళ్ల వరకే వస్తాయన్నారు. గ్రామాల్లో నిరుపేదలు పెద్ద సంఖ్యలో ఉన్నందున మరిన్ని ఇళ్లు మంజూరు చేయాలని ఆయన కోరారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో స్టేషన్ ఘన్‌పూర్‌లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు, ఈ సమావేశంలో నాయకులు చిట్యాల సోమన్న, మాచర్ల సారయ్య, ఈదూనూరి మదార్, జక్కుల సోమన్న పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత కనకారెడ్డి

ఎన్‌సీసీ కేడెట్స్‌కు అభినందన

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 25 : కర్ణాటక రాష్ట్రం బెల్గామ్ జిల్లాలో నిర్వహించిన జాతీయ స్థాయి ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ కేడెట్స్ ట్రేకింగ్ క్యాంపులో యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీకి చెందిన ముగ్గురు ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ క్యాడెట్స్ అనిల్‌కుమార్, నవీన్, మహేష్ మొదటి బహుమతి సాధించారు. వారిని బుధవారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి అభినందించారు.

క్యాడెట్స్‌ను అభినందిస్తున్న జ్యోతి

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

ఒకరిపై కేసు నమోదు

శాయంపేట డిసెంబర్ 25 : నిషేధిత గుట్కా ప్యాకెట్లను విక్రయిస్తుండడంతో వాటిని సీజ్ చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. వివిధ గ్రామాల్లో బుధవారం పెట్రోలింగ్ చేస్తుండగా మండలంలోని వసంతాపూర్ గ్రామంలో కోసరి గోపాల్ తన కిరాణా దుకాణంలో నిషేధిత గుట్కాలు అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందని చెప్పారు. కిరాణా షాపు వద్దకు వెళ్లే సరికి గోపాల్ పోలీసులను చూసి పారిపోతుండగా, అతడిని పట్టుకుని షాపును తనిఖీ చేసినట్లు తెలిపారు. దుకాణంలో రూ.22,500 విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లు లభించాయన్నారు. గుట్కా ప్యాకెట్లను సీజ్ చేసి దుకాణ నిర్వాహకుడు గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పోలీసు సిబ్బంది సాగర్, ఖలీద్ పాల్గొన్నారు..

27, 28 తేదీల్లో గ్రామ పంచాయతీ ఉద్యోగుల టోకెన్ సమ్మె

జీపీ ఉద్యోగుల సంఘం వెల్లడి

బచ్చన్నపేట, డిసెంబర్ 25 : గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కారోబార్లు, బిల్‌కలెక్టర్లతో పాటు సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28, 29 తేదీల్లో టోకెన్ సమ్మె నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం ప్రకటించింది. ఈ మేరకు సంఘం నాయకులు కొమురెల్లి శ్రీనివాస్, తేలుకంటి మురళి, అన్వర్, ప్రభాకర్, బాబుగౌడ్, నాగయ్య బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రంలో రెండు రోజుల పాటు సమ్మె చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎండీపీవో కార్యాలయాల ఎదుట టెంట్లు వేసి ఆందోళన చేపట్టాలని సంఘం తీర్మానించిందని వారు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వమే నేరుగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండో పీఆర్‌సీ పరిధిలోకి గ్రామ పంచాయతీ సిబ్బందిని తీసుకురావాలని, జీవో 60 ప్రకారం వేతనాలు అందించాలని అన్నారు. జీవో 51ని సవరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత కేటగిరీలనే కొనసాగించాలన్నారు. కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. అర్హులైన సిబ్బందికి ప్రమోషన్లు కల్పించాలన్నారు. ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. పంచాయతీ సిబ్బందిని అందరినీ పర్మినెంట్ చేయాలని వారు డిమాం డ